ప్రజాశక్తి
మంగళవారం 25 జూన్ 2024
5
అల్లూరి సీతారామరాజు



మధ్యాహ్న భోజనాన్ని పటిష్టంగా అమలు చేయాలి

-జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అల్లూరి జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ సూచించారు. మండలంలోని అరకు గవర్నమెంట్ హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజన పథకంతో పాటు పాఠశాల ఆవరణ పరిసరాలను పరిశీలించారు. పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో సమయ పాలన పాటిస్తూ విద్యార్థులకు విద్యా బోధన చేయాలని సూచించారు.



ప్రశ్నలు అడుగుతున్న డిఇఒ

నిరుపయోగంగా జల్ జీవన్ మిషన్

-ప్రారంభించిన కొద్ది రోజులకే నిలిచిన తాగునీటి సరఫరా
- అవస్థలు పడుతున్న కుమడ గ్రామస్తులు



నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండలంలోని మారుమూల ప్రాంతమైన కుమడలో ఏర్పాటు చేసిన జల్ జీవన్ మిషన్ పథకం నిరుపయోగంగ మారింది. దీన్ని ప్రారంభించిన కొద్ది రోజులకే పని చేయక పోవడంతో తాగునీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో, తాగునీటి కోసం ఊటగెడ్డలను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఈ కుమడ గ్రామంలో తాగునీటికి గిరిజనులు అనేక అవస్థలు పడేవారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మండల ఆర్డబ్ల్యూఎస్ అధికారులు జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా సుమారు 10 లక్షల 90 వేలు మంజూరు చేశారు. కుమడ గ్రామంలో 50 కుటుంబాలు కలిగి ఉన్నప్పటికీ కేవలం 30 కుళాయిలు ఏర్పాటు చేశారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయాల్సి ఉంది. గత నవంబర్ నెలలో జల్ జీవన్ మిషన్ రక్షిత తాగునీటి పథకాన్ని ప్రారంభించినప్పటి నుండి నేటి వరకు పూర్తి స్థాయిలో కుళాయిలు ఏర్పాటు చేయలేదని ఆ గ్రామస్తులు కే.జగదీష్, ఎం.సూరిపడాల్, వి నాగేశ్వరరావు, మఠం నీలకంఠ, సూర్యనారాయణ, సీతారాం, విశ్వనాథంలు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరా నిలిచి పోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వారు తెలిపారు. తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని, లేనిపక్షంలో అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానికులు హెచ్చరించారు.



నిరుపయోగంగా ఉన్న పైపులు



పని చేయని కుళాయి



ఆందోళన చేస్తున్న డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న పిఒ సూరజ్ గనోరే

డ్వాక్రా రుణాల్లో అవినీతికి పాల్పడిన

వెలుగు సిసిలపై చర్యలు తీసుకోవాలని ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

దేవీపట్నం మండలంలో డ్వాక్రా రుణాలు మంజూరులో అవినీతికి పాల్పడిన వెలుగు సీసీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలు ధర్నా నిర్వహించారు. సిసిలపై చర్యలు తీసుకోవాలని, వారికి అండగా ఉంటున్న ఏపీడీని సస్పెండ్ చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో ఐటిడిఎ ఎపిఒ, వెలుగు ఏపీడి ఆందోళనకారుల వద్దకు వచ్చి సర్ది చెప్పే ప్రయత్నం చేయగా అక్కడే బైఠాయించి తక్షణమే ప్రాజెక్టు అధికారి రావాలని డిమాండ్ చేశారు. పిఒ వచ్చే వరకు కదిలే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. సాయంత్రం 5 గంటలకు ప్రాజెక్టు అధికారి వచ్చి వారి డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. ఈ అవినీతిపై రిపోర్ట్ తయారు చేయాలని ఏపీఓను ఆదేశించారు. అనంతరం సీసీలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని ప్రాజెక్టు అధికారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, కె.శాంతిరాజు, మండల సమాఖ్య లీడర్లు సంకురమ్మ, పొసమ్మ, 60 మంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ జమాల్ బాషా

చుట్టుమెట్టలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలోని చుట్టుమెట్టలో ఆకస్మిక మరణాలపై సోమవారం మెడికల్ క్యాంపును జిల్లా వైద్యాధికారి జమాల్ భాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక వైద్యాధికారి నిఖిల్ మాట్లాడుతూ, చుట్టుమెట్టలో ఆకస్మిక మరణాలపై ప్రజలు భయాందోళనకు గురి కావొద్దన్నారు. మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏ రకమైన వ్యాధులు ప్రబలినా సమీపంలో వైద్యాధికారులను సంప్రదించి వైద్యం పొందాలన్నారు. గ్రామస్తులు మానసికంగా సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఎవరికైనా అనారోగ్యం తీవ్రతగా ఉంటే మెరుగైన వైద్యం కోసం జిల్లా హాస్పిటల్‌కు పంపిస్తున్నామన్నారు. ప్రస్తుతం గ్రామంలోని గిరిజనులు ఆరోగ్యాంగానే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటీడీఏ పరిధిలోని కొయ్యూరు మండలం పిట్టాచలం గ్రామంలో నెలకొల్పిన హెచ్‌పిసిఎల్ పెట్రోల్ బంక్ నిర్వహణకు గిరిజన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల నుండి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాడేరు ఐటిడిఎ పరిదిలోని స్థానిక గిరిజనులు డిగ్రీ అర్హత పొందిన యువతి, యువకులు ధరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. బంక్ నిర్వహణకు రెండు సంవత్సరాల కాల వ్యవధికిగాను ఐ.టి.డి.ఎ, ఎంపిక కాబడిన లీజుదారుడు మధ్య లీజు ఒప్పందం ఉంటుందన్నారు. ఐటిడిఎకు ఏక మొత్తంగా డిపాజిట్ రూ. 5,00,000 చెల్లించాలన్నారు. ప్రతి నెల అద్దె నిమిత్తం మొదటి సంవత్సరం నెలకు అద్దె రూ. రూ.50,000, రెండోవ సంవత్సరంలో రూ. 75,000 చెల్లించి పెట్రోలు బంక్ నిర్వహణ చేసుకోవలసి ఉంటుందన్నారు.ధరఖాస్తు చేసుకొనే అభ్యర్ధి ఒక లక్ష రూపాయలు డిడి అందజేయాలన్నారు. ఈ ఒప్పందా లకు అంగీకరించిన అభ్యర్ధులు ఈనెల 25వ తేదీ నుండి వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ధరఖాస్తు చేసుకోవచ్చునని, 8న లాటరీ పద్ధతి లో అభ్యర్థుల ఎంపిక చేయబడునని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్: 9440972048లో సంప్రదించాలని స్పష్టం చేశారు.

ఘనంగా ఎంపీల ప్రమాణ స్వీకారం



ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, అరకు పార్లమెంట్ స్థానాల నుంచి గెలుపొందిన ఎంపీలు ఎం.శ్రీభరత్, సిఎం.రమేష్, జి.తనూజారాణిలు సోమవారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. వారికి పలువురు అభినందనలు తెలియజేశారు.



విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ పూనం సరోజిని

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ

ప్రజశక్తి- విఆర్.పురం

మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధిలోని కస్తూర్బాయి బాలిక విద్యాలయం, మినీ గురుకుల పాఠశాలల విద్యార్థులకు రేఖపల్లి సర్పంచ్ పూనం సరోజిని చేతులు మీదుగా సోమవారం నోట్ పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబుతో కలిసి కెజిబివిలో నాడు-నేడు కింద జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. తరువాత పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజిని మాట్లాడుతూ ప్రాథమిక విద్య నుండి ఉన్నత చదువులు చదవడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సీట్లు కోసం వివిధ పాఠశాలలకు కాళ్లరిగేలా తిరుగుతున్నారని, చదువుకుంటామనే వారికి ప్రవేశాలు కల్పించాలని కోరారు. పిల్లలు బడికి వెళ్లకపోతే బాల్య వివాహాలు జరిగి అవకాశం, చెడు అలవాట్లకి గురయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. నాడు-నేడు కింద మంజూరైన భవన నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. సీజన్లో వచ్చే వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం శివ ప్రసాద్, కెజిబివి హెచ్ఓ పి.వెంకమ్మ, కెజిబివి, మినీ గురుకులం, సిబ్బంది, సచివాలయం ఇంజనీరింగ్ తరుణ్, బుచ్చిరాజు, మహిళా పోలీస్, సాయి కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలి

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ, ప్రైమరీ పాఠశాలలో విద్యా ప్రమాణాలను మెరుగు పరచాలని ఎంపీపీ శెట్టి నీలవేణి సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలో ఆశ్రమోన్నత పాఠశాలలో పని చేస్తున్న హెచ్ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయ సిబ్బంది ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రైమరీ పాఠశాలల విద్యార్థులు కనీసం తెలుగు పదాలు చదవలేని పరిస్థితిలో ఉన్నారని, ఉపాధ్యాయులు పనితీరు మార్చుకొని సరైన విద్యా బోధన అందించేందుకు కృషి చేయాలని ఆమె సూచించారు.

ఎంపీడీవో నగేష్ మాట్లాడుతూ, పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం క్రమం తప్పకుండా విద్యార్థులకు భోజనాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఓ లక్ష్మినారాయణ హెచ్ఎంలు భి.మంగ, అప్పల స్వామి, మల్లేశ్వరి, సైమన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు

17 నెలల వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని 11 మండలాల్లో ప్రకృతి వ్యవసాయ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు 17 నెలల నుండి బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సంబంధిత కార్మికులు సోమవారం రంపచోడవరం ఐటిడిఎ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులకు వ్యవసాయంలో మెలుకువలు నేర్పుతున్న ఎపి కమ్యూనిటీ నేచరల్ ఫామింగ్‌లో పనిచేస్తున్న 280 మంది కార్మికులకు గత ప్రభుత్వం వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. 17 నెలలుగా వేతనాలు లేకపోవడంతో అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వేతనాలు చెల్లించాలని అధికారులకు అనేకమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి కార్మికులకు 17 నెలల వేతన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఐటిడిఎ కార్యాలయం ఎదుటే బైఠాయిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఐటిడిఎ ఏపీవో ఐటిడిఎ పిఒతో ఫోన్లో మాట్లాడి 15 రోజుల్లో వేతనాలు పూర్తిగా చెల్లిస్తామని హామీ హామీ ఇచ్చారు. దీంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి శాంతిరాజు, ప్రకృతి వ్యవసాయ విభాగం కార్మికులు రామస్వామి, రత్నరాజు, నందా భాయ్, మంగమ్మ, పద్మజ, ప్రసాదు, నాగరాజు, సీతయ్య, చిలకమ్మ, కృష్ణ, ఉమామహేశ్వరి, లక్ష్మీప్రసన్న, గణేష్, సురేష్, అప్పలరాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం కార్మికులు



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరులో వైసిపి విజయోత్సవ ర్యాలీ

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి ఘన విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమవారం పాడేరులో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రమాణ స్వీకార అనంతరం పాడేరు వచ్చిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మోదపల్లి జంక్షన్‌లోని అమ్మవారి పాదాల వద్దకు వెళ్లిన విశ్వేశ్వరరాజుకు పార్టీ నాయకులు పూలమాలలు వేసి సాదర స్వాగతం పలికారు. మోదకొండమ్మ అమ్మవారిని విశ్వేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. అక్కడ నుంచి ఊరేగింపుగా వాహనాలలో పాడేరు పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు. కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిసిసి గొడౌన్లలో నిత్యావసర సరుకుల

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జిసిసి గొడౌన్లలో నిత్యావసర సరుకులకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లిలోని జిసిసి గొడౌన్‌ను ఐటీడీఏ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ సోమవారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. జిసిసి గొడౌన్‌లో ఎన్ని మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నాయి, ఇతర నిత్యవసర సరుకులు ఏమేమి ఉన్నాయి పరిశీలించారు. మండలంలో ఎన్ని కుటుంబాలు, ఎన్ని రేషన్ కార్డులు, ఎన్ని రేషన్ డిపోలు ఉన్నాయి, ప్రతినెల ఎన్ని మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం వస్తుంది, ప్రస్తుతం ఈ గోదాములో ఎన్ని మెట్రీ టన్నుల రేషన్ ఉన్నది, వివిధ ప్రభుత్వ పాఠశాలలకు, ఆశ్రమ పాఠశాలలకు ఎన్ని మెట్రిక్ టన్నుల రేషన్ సరఫరా చేస్తున్నదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ అర్హులైన రేషన్ కార్డు లబ్దిదారులకు సకాలంలో రేషన్ సరఫరా చేయాలన్నారు. నిత్యావసర సరుకులకు సంబంధించిన రికార్డులు ఎప్పటికప్పుడు సంబంధిత రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మారేడుమిల్లి, వై రామవరం మండలాల్లోని ఎగువ ప్రాంతాల్లో తెల్లరేషన్ కార్డుల లబ్ధిదారులకు ప్రతినెల ప్రభుత్వ నిబంధన ప్రకారం రేషన్ సరఫరా చేయాలని సూచించారు. రేషన్ బియ్యం సరఫరా చేయడంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఎవి.రమణ, జిసిసి సీనియర్ మేనేజర్ ముళ్ళ నాగ వెంకట రాజారెడ్డి, గొడౌన్ సూపరింటెండెంట్ కె.అబ్బాయి రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జిసిసి గొడౌన్‌లో రికార్డులు, స్టాక్ తనిఖీ చేస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రైతులకు సూచనలు ఇవ్వండి

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని చిన్నగెడ్డ సచివాలయాన్ని ఎన్డీఏ కూటమి నాయకులు సోమవారం సందర్శించారు. సచివాలయం సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు మాట్లాడుతూ, పోడు భూములలో వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న గిరి రైతులకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి సాగుపై తగు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావాలని సూచించారు. వ్యవసాయ పనిముట్లను, విత్తనాలను సకాలంలో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కిమ్ముడు పండు, జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు వంతల రాజుబాబు, శెట్టి స్వామి, చల్లంగి రవి తేజ, మఠం శ్రీనివాసరావు, టీడీపి పార్టీ నాయకులు ముర్ల భాస్కరరావు, మర్రి మంగ్లు, కిల్లో సుబ్బారావు, వంతల బాలక్రిష్ణ, గణేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న తిమోతి

స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -హుకుంపేట:స్వయంకృషితో ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని అఫ్ హెూల్డ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఏ ఫిలిప్ తిమోతి అన్నారు. మండలంలోని శిక్షణ పొందిన మహిళలకు కార్యాలయంలో సోమవారం సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మహిళలు స్వయం కృషితో స్వయం ఉపాధి పొందేందుకు ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన అన్నారు. నిరుపేద మహిళలు తమ సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకొని శిక్షణ పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ శిక్షణ టీచర్ కె. మచ్చమ్మ, సంస్థ కోఆర్డినేటర్ .గురుమూర్తి, విజయ్, మాలన్న పాల్గొన్నారు.

బోరు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలోని సాయి బాబా గుడి వద్ద బోరు మరమ్మతు చేపట్టాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు పిర్యాదు చేయడంతో స్పందించిన హుకుంపేట ఎంపీపీ, ఎంపీడీఓ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు బోరు మరమ్మతు పనులు సోమవారం చేపట్టారు.దీంతో నెలన్నర పాటు నీటి కష్టాలు తీరాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆధునికీకరించిన పాఠశాల ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని భీమవరం పంచాయతీ గుమ్మడిగండువ గ్రామంలో రూ.3.50 లక్షలతో ఆధునీకరించిన ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటిడిఏ నిధులు వెచ్చించి పాఠశాలను ఆధునికరించామని చెప్పారు. బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపించి ఉన్నతంగా చదివించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, గిరిజన సంక్షేమ శాఖ ఏఈ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆధునికీకరించిన ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తున్న పిఒ అభిషేక్

యండపల్లివలసలో అపారిశుధ్యం

-రహదారికి ఇరువైపులా చెత్తా చెదారం
-పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయితీ యండపల్లివలస గ్రామంలో గర్ల్స్ ఏపీఆర్ రహదారిపై పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎటు చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి.డ్రైనేజీపై చెత్తా చెదారం పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో, ఈ రోడ్ల వెంట వెళ్లాలంటేనే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లవసిన పరిస్థితి వస్తుంది.గ్రామస్తులు నిత్యం ఆ రోడ్డు పై రాకపోకలు సాగిస్తుంటారు. చెత్తా చెదారంతో దోమలు విజృంభించడంతో రోగాల పాలై ఆసుపత్రుల పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లాల్సి ఉన్నా ఆ ఊసే లేదని వాపోయారు. సంబంధిత పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో రోడ్లన్నీ చెత్తతో నిండి పోయాయని స్థానికులు విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి దోమల బెడద నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ఉన్న చెత్తా చెదారం

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ మొస్య

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో 24 పంచాయతీ గ్రామాలకు జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి అందించడమే లక్ష్యమని జల్ జీవన్ మిషన్ కో- ఆర్డినేటర్ పి.పుల్లారావు తెలిపారు. సోమవారం టోకూరు సర్పంచ్ కిల్లో మొస్య అధ్యక్షతన పూలుగుడ, రాయవలస గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య కమిటీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా పుల్లారావు, ఏఈ గౌతమ్‌లు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి గ్రామానికి ఇంటింటికీ సురక్షిత మంచినీరు అందించడం జరుగుతుందన్నారు.

స్థానిక సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ, టోకూరు పంచాయతీలో ఇప్పటికే గ్రామ పంచాయతీ ద్వారా సురక్షిత మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. జల్ జీవన్ మిషన్ నిధులు చిట్టంపాడు, కంబవలస, కొత్తవలస, బోడగుడ, సీసాగూడ గ్రామాలకు మంజూరు అయ్యాయని, పనులు జరుగుతున్నాయని తెలిపారు. బలియగుడ, జాకరవలస, రాయవలస గ్రామాల్లో కూడా జల్ జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరు చేసి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాలని ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గెమ్మెల శర్చన్న, సిబ్బంది నాగేశ్వరరావు, రాజు, వార్డు సభ్యులు గుజ్జెల పద్మ, మాజీ సర్పంచ్ దొన్ను, గ్రామస్తులు పాల్గొన్నారు

బురదగడ్డ రోడ్డును బాగుచేయరూ...

ప్రజాశక్తి-దుంబ్రిగుడ

మండలంలోని అరకు సంత బయలు సమీపంలోని మండల సరిహద్దులోని బురద గడ్డ వంతెన వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి పి.చిన్నస్వామి డిమాండ్ చేశారు. బురద గడ్డ వంతెనకు ఆనుకొని రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా ఉన్న రోడ్డును ఆ పార్టీ నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాలతో బురద గడ్డ వంతెనకు అనుకొని ఉన్న రోడ్డు శిథిలావస్థలో చేరి పెద్ద రంధ్రం ఏర్పడటంతో ప్రమాదకరంగా మారిందన్నారు. సుమారు మూడు నెలల నుంచి రోడ్డు ప్రమాదకరంగా ఉన్నా మరమ్మతు చేపట్టడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. వాహనదారులు ఆదమరిచి వాహనాలు నడిపితే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని, తక్షణమే రోడ్డు మరమ్మతు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ జి.సోమేశ్వరరావు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కే.పోతురాజు, మండల మాజీ ప్రధాన కార్యదర్శి టి.భీమారావు పాల్గొన్నారు.



రోడ్డును చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నేరాలు ఘోరాలు

జెసిబి, లారీ సీజ్
రూ.33 వేలు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం ఎల్‌వి.పాలెం పంచాయతీ పరిధి ఎన్‌టిఆర్ కాలనీ సర్వేనెంబర్ 207లో సోమవారం అక్రమంగా మైనింగ్ చేస్తున్న ఒక లారీ, ఒక జెసిబిని మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. జట్లమ్మకొండపై ఎటువంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం కోసం గ్రావెల్ తవ్వకాలు జరపడంతో స్థానికులు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. విఆర్ఓ అప్పలరాజు, విఆర్ఎ కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి లారీ, జెసిబిని పట్టుకొని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. సోమవారం ఉదయం మైనింగ్ ఆర్ఐ శైలజ బృందం సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ మైనింగ్ గుర్తించి కొలతలు వేశారు. సుమారు 50 క్యూబిక్ మీటర్లు మట్టిని తీసినట్లు గుర్తించి రూ.33 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ, అక్రమంగా మైనింగ్‌కు పాల్పడితే చర్యలు చేపడతాయని హెచ్చరించారు.

లాడ్జీలో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నంలో ఒక ప్రైవేటు లాడ్జిలో సోమవారం ఉదయం రాంబిల్లి మండలం కొత్తపట్నం గ్రామానికి చెందిన చింతకాయల భాగ్యలక్ష్మి అనే వివాహిత మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు...నర్సీపట్నం మున్సిపాలిటీకి చెందిన ఆకుల అజయ్‌కుమార్, భాగ్యలక్ష్మిల మధ్య వివాహేతర సంబంధం కొంత కాలంగా కొనసాగుతుంది. భాగ్యలక్ష్మి రాంబిల్లి మండలంలోని బ్రాండిక్స్ కంపెనీలో పని చేస్తుంది. అజయ్‌కుమార్ కూడా కొంతకాలం అదే కంపెనీలో పని చేసేవాడు. అజయ్‌కుమార్ ప్రస్తుతం పెదబొడ్డేపల్లిలో ఉంటున్నాడు. ఇతడిని కలవడానికి తరచుగా భాగ్యలక్ష్మి నర్సీపట్నం వస్తుండేది. ఎప్పటిలాగే ఇద్దరు ఆదివారం రాత్రి పట్టణంలోని ఓ లాడ్జిలో గడిపారు. ఈ క్రమంలో నగదు, బంగారం కావాలని అజయ్‌కుమార్ డిమాండ్ చేశాడు. ఇదే విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో, మనస్తాపం చెందిన భాగ్యలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ఆవరణలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో సోమవారం పిఠాపురం ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యాన పలు, పండ్లు, నీడను ఇచ్చే మొక్కలను నాటారు. పక్షుల ఆహారం నిమిత్తం ధాన్యపు కుచ్చులను కూడా చెట్లకు కట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించే క్రమంలో ట్రస్ట్ కార్యకర్తలు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు ముందుగా మొక్క నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవి.పార్వతీశం, ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎం.సుధాకర్, పలువురు న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది, ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి, ట్రస్ట్ కార్యకర్తలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆలయాల పురోహితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్‌లోని ప్రయివేటు అర్చక పురోహితులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఆర్‌బిఎస్.వ్యవస్థాపక అధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య ఆధ్వర్యాన ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళగిరిలో కలిసి అర్చకులు వినతిపత్రం అందించారు. ప్రయివేటు పురోహితులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెలగలేటి సతీష్ కుమార్ శర్మ, కార్యదర్శి అధికారుల కాళిదాసు, ఉపాధ్యక్షులు ఈశ్వర ప్రగడ విజయకుమార్ రాజా, విశాఖ జిల్లా అధ్యక్షులు నేరేళ్ల కామేశ్వర శర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం, గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. గంభీరం పంచాయతీ సెక్రటరీ కె.చలపతిరావు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి విద్యార్థులందరికీ ఉచితంగా నోటు పుస్తకాలు అందించడానికి ముందుకొచ్చారు. 55 మందికి నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని వారు కోరారు.



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న రాజు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా వుండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని చింతపల్లి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.రాజు అన్నారు. కొయ్యూరు మండలం డౌనూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సోమవారం ఏర్పాటు చేసిన డ్రగ్ రహిత సమాజం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుండే మత్తు పదార్థాలకు దూరంగా వుండి డ్రగ్ రహిత సమాజం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో గంజాయి, సారాయి మొదలైన మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కాకుండా చూడాలని సూచించారు. వాటిని రవాణా చేసే వ్యాపారుల వలలో పడి జీవితాలు నాశనం కాకుండా వారిని చైతన్య పర్చాల్సిన అవసరం విద్యార్థులు, యువతపై వుందని పేర్కొన్నారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను, వాటి రవాణా చేయడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు విధించే శిక్షలు హెడ్ కానిస్టేబుల్ ఎంవి.సత్యనారాయణ వివరించారు. తమ పాఠశాలలో విద్యార్థులను చైతన్య పరిచే ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల ప్రధానోపాధ్యాయులు ఎస్.ప్రభుదాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సిఎం, డిప్యూటీ సిఎం ఫొటోలు అందజేత

ప్రజాశక్తి- దేవీపట్నం : దేవీపట్నం మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫొటోలను తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టా మెహర్ బాబాగౌడ్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు సోమవారం అధికారులకు అందజేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్, తహశీల్దారు, ఎంపిడిఒ, వెలుగు, ఎన్‌ఆర్‌ఇజిఎస్, పంచాయతీ కార్యాలయాలకు, ప్రభుత్వ ఆసుపత్రులకు ఫొటోలను అందజేశారు. ఈ సందర్భంగా మెహర్ బాబా గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం నుంచి వచ్చిన అనుమతులు మేరకు మిరియాల శిరీష, భాస్కర్ ఆదేశాలు మేరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయ గోడలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఫోటోలను తప్పనిసరిగా తగిలించమని చెప్పినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు దాకారపు సత్యనారాయణ, కె.వీరబాబు, దివిటీ ఆంజనేయులు, గొర్రెల మురళి, కొత్తపల్లి సత్యనారాయణ, కారం పోసమ్మ, కొత్తపల్లి సతీష్, పోతుల గాంధీ, కర్రి నాని, అయినవిల్లి భద్రం, రేలంగి రాంబాబు, మట్ట వెంకటేశులు, పూడి రాజు, దాకారపు రామకృష్ణ, కొమ్మన శ్రీను, ఈత శివాజీ, గర్లంక చిన్ని, కామిశెట్టి శ్రీను, కుక్క శ్రీను, నల్లంశెట్టి సతీష్ పాల్గొన్నారు.

భారత్ టి-20లోకి విశాఖ కుర్రాడు

- నితీష్ కుమార్ రెడ్డి ఎంపికపై పలువురు హర్షం

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఇటీవల ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డు అందుకున్న విశాఖకు చెందిన నితీష్ కుమార్‌రెడ్డి భారత్ టి - 20 జట్టులోకి ఎంపికయ్యాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఆరంగేట్రం చేసిన మూడేళ్ల వ్యవధిలోనే ఐపిఎల్‌లో స్థానం సంపాదించి సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో నితీష్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జులైలో జరగబోయే జింబాబ్వే పర్యటన కోసం ఆయన్ని భారత్ టి-20 జట్టుకు ఎంపికచేశారు. ఈ మేరకు బిసిసిఐ సీనియర్ సెలక్షన్ కమిటీ సోమవారం జట్టును ప్రకటించింది. ఈ సందర్భంగా ఎసిఎ అధ్యక్షులు పి.శరత్‌చంద్రారెడ్డి, కార్యదర్శి ఎస్‌ఆర్.గోపినాథ్‌రెడ్డితో పాటు ఎసిఎ అపెక్స్ మెంబర్లు శుభాకాంక్షలు తెలియజేశారు.

కూటమి ప్రభుత్వానికి సమస్యల సవాళ్లు

ఎన్ఎఒబి నిర్వాసితులకు నేటికీ అందని పరిహారం, ప్యాకేజీ
- విశాఖ - చెన్నయ్ కారిడార్ భూ నిర్వాసితులకు దక్కని నష్టపరిహారం
- నిధుల్లేక సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు
- ఐదో షెడ్యూల్‌లో చేర్చక నాన్‌షెడ్యూల్ గిరిజనుల అవస్థలు
- అభివృద్ధి అడుగులు పడాలని ప్రజల ఆకాంక్ష

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కొత్త ప్రభుత్వం ముందు జిల్లాలోని అనేక పాత సమస్యలు సవాలుగా ఉన్నాయి. గత ప్రభుత్వం వలే కూటమి ప్రభుత్వం కాలం నెట్టుకొస్తుందో, దశలవారీగా ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ సమతుల్యత సాధనకు కృషిచేస్తుందో, లేదో చూడాల్సివుంది. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నవారిలో వంగలపూడి అనిత హోంశాఖ మంత్రిగా, సిహెచ్.అయ్యన్నపాత్రుడు శాసనసభాపతిగా వున్నారు. మరో ఐదుగురు కూటమి ఎమ్మెల్యేలు, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ ఎంతవరకూ జిల్లా సమస్యలపై స్పందించి శ్రద్ధచూపుతారో చూడాల్సివుంది.

వాస్తవానికి జిల్లాలోని వివిధ తరగతుల ప్రజలెదుర్కొంటున్న సమస్యలేవీ ఈ ప్రభుత్వానికి కొత్తకావు. గతంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాల్లో నిర్లక్ష్యం చేయబడిన, నిరాకరించిన సమస్యలతోనే ప్రజలు బాధపడుతున్నారు. హోం మంత్రి అనిత ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోని నక్కపల్లి మండలంలో విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్‌తో భూములు కోల్పోయిన ఐదు పంచాయతీలు, 11 గ్రామాల నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, మెరుగైన ప్యాకేజీ, పునరావాసం కల్పించాలి. నక్కపల్లిలో డిగ్రీ కాలేజీ విద్యార్థులకు భవనాల్లేక జూనియర్ కాలేజీలో ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నారు. నక్కపల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ట్రామా కేర్ సెంటర్ లేక రహదారి ప్రమాదాల్లో గాయపడ్డవారు ఇతర ఆస్పత్రులకు వెళ్లేలోపు మృత్యువాతపడుతున్నారు. అసంపూర్తిగా నిలిచిన ఉద్దండపురం తాగునీటి పథకం పూర్తిచేయాల్సివుంది. తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి పునరుద్ధరించాలి. కోటవురట్ల మండలం జల్లూరు, ఎండపల్లి మధ్య వరహానది బ్రిడ్జి నిర్మాణ పనులు, రామచంద్రాపురం-పందూరు గ్రామాల మధ్య వరహా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి. ఎన్ఎఒబి నిర్వాసిత మత్స్యకారులకు బోట్ల పరిహారం ఇవ్వలేదు. ఉపాధి కోల్పోయిన బాధిత నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించలేదు. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి మండలాలు సహా నక్కపల్లి హెటిరో, డెక్కన్ కెమికల్ పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉపాధి లభించేలా శ్రద్ధ చూపాలి. పరిశ్రమల ప్రమాదాలు, కాలుష్యాన్ని నియంత్రించే చర్యలు చేపట్టి ప్రజలకు భరోసా ఇవ్వాల్సివుంది. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో ఫిషింగ్ హార్బర్, నక్కపల్లి మండలం రాజయ్యపేట, దొండవాకలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణ పనులు ప్రారంభించాలి. అనకాపల్లి జిల్లా కేంద్రంలో మురుగునీరు పోయేలా కాలువ నిర్మాణాలు చేపట్టి దోమల సమస్యను పరిష్కరించాలి. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలి. సబ్బవరంలోని జాతీయ విద్యా సంస్థ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ (పెట్రోలియం యూనివర్సిటీ)కి శాశ్వత భవనాలు లేక ఆంధ్రాయూనివర్శిటీలో తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. ఆయా సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరించాల్సి ఉంది.

సుజల స్రవంతికి నిధులు కేటాయించాలి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 3.25 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి నిర్మాణ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ జలాశయాల మరమ్మతులు చేపట్టకపోవడంతో శివారు ప్రాంత ఆయకట్టుకు సాగు నీరందని పరిస్థితి కొనసాగుతోంది. ఆయా సమస్యలపైనా దృష్టి పెట్టాలి.

జిల్లాలోని మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, చోడవరం నియోజకవర్గాల్లోని తొమ్మిది నాన్ షెడ్యూల్ మండలాలు, 58 పంచాయతీల్లో 320 నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చి నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి రెండు ప్రభుత్వాలూ విస్మరించాయి. ఈ డిమాండ్‌పై ఐదో షెడ్యూల్ సాధన కమిటీ ఎంతో కాలం పోరాడింది. నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల్లేక అక్కడి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని ప్రధానమైన సమస్యల పరిష్కారంపై బిజెపి ఎంపీ సిఎం రమేష్, కూటమి ఎమ్మెల్యేలు మాటకు కట్టుబడతారా ? గెలిపించిన ప్రజలకు పంగనామం పెడతారా ? అనేది కాలక్రమంలో తెలుస్తుంది.

శారదా పీఠానికి కేటాయించిన భూములను స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా భీమిలి మండలం కొత్తవలసలో శారదా పీఠానికి కేటాయించిన 15 ఎకరాల భూములను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని విదసం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో ఆయన నిరసన తెలిపారు. భూముల విషయమై ఇన్‌ఛార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఈతలపాక సుజాత, సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, బొడపాటి శామ్యూల్ కుమార్, కస్తూరి వెంకటరావు, కె.రవిశేఖర్, అఖిల్, బండారు రవి పాల్గొన్నారు.

జగన్నాథ స్వామి రథోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెయిన్ రోడ్డులోని శ్రీ జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో వచ్చే నెల 6 నుండి 18 వరకు జరిగే శ్రీ జగన్నాథస్వామి వారి రథోత్సవాల పోస్టర్‌ను దక్షిణ ఎమ్మెల్యే చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్ ఆవిష్కరించారు. సోమవారం ఆయన దేవస్థానాన్ని సందర్శించి శ్రీ జగన్నాథ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో ఇఒ రాజగోపాల్ రెడ్డి, ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు పాల్గొన్నారు.

జన్మభూమి రైలు సేవలు కొనసాగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూన్ 23 నుంచి ఆగస్టు 11 వరకు విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల దృష్ట్యా రద్దు చేయబడిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రజల డిమాండ్‌తో కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జూన్ 26 నుంచి ఆగస్టు 10 వరకు, 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ జూన్ 27 నుంచి ఆగస్టు 11 వరకు పునరుద్ధరించబడతాయని, దాని షెడ్యూల్, స్టాపేజ్‌లు యథాతథంగా కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఆ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

రైళ్ల రద్దు / స్టేషన్ల ఉపసంహరణ

జబల్‌పూర్ డివిజన్, వెస్ట్ సెంట్రల్ రైల్వేలో డబ్లింగ్, ప్రీ-నాన్-ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా 18573 విశాఖపట్నం-భగత్‌కి కోఠి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 27 నుంచి జులై 4 వరకు, 18574 భగత్ కి కోఠి - విశాఖపట్నం వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను జూన్ 29 నుంచి జులై 6 వరకు, 20807 విశాఖపట్నం - అమృతసర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను జులై 5, 6, 9 తేదీల్లోనూ, 20808 అమృత్‌సర్ - విశాఖపట్నం హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను జులై 6, 7, 10 తేదీలలోనూ రద్దు చేశారు. 20807 విశాఖపట్నం - అమృత్‌సర్ హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు జూన్ 25, 28, 29, జులై 2 తేదీలలో మలేడి స్టేషన్‌లో స్టాపేజ్‌ను తొలగించారు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

'పబ్లిక్ గ్రీవెన్స్'కు 38 దరఖాస్తులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టమ్)కు 38 దరఖాస్తులు అందాయి. వీటిని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్‌కుమార్, ఐటిడిఎ ఎపిఒ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. దేవీపట్టణం మండలం తున్నూరు పంచాయతీ పరిధిలో సెల్ టవర్ ఏర్పాటు చేయడానికి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇవ్వాలని ఆ పంచాయతీ సర్పంచ్ సాధన విజయభాస్కర్ రెడ్డి దరఖాస్తు సమర్పించారు. మారేడుమిల్లి మండలం వైదెపూడి గ్రామంలో 42 మంది విద్యార్థులు చదువుకునే స్కూలు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనం మంజూరు చేయాలని, తాడేపల్లి గ్రామం తారు నుండి సద్దిరేవులువీధి వరకు మూడు కిలోమీటర్లకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని బచ్చల బొజ్జిరెడ్డి, వలల సుగ్గిరెడ్డి, చవల సుగ్గిరెడ్డి విన్నవించారు. పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన తోయ్యేరులో 18 మంది ముంపు బాధిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ద్వారా ఇంటి స్థలం ఇవ్వాలని లింగంపల్లి బేబీ, రమణి, సీతమ్మ అర్జీ సమర్పించారు. వికలాంగుల పింఛను మంజూరు చేయాలని రంపచోడవరం గ్రామానికి చెందిన చెరుకూరి చక్రపాణి దరఖాస్తు ఇచ్చారు. నేషనల్ హైవే 516ఈలో రోడ్డు వెడల్పులో భూమి నష్టపోయిన దానికి నష్టపరిహారం చెల్లించాలని గంగవరం గ్రామానికి చెందిన మడకం వెంకటరమణ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎంహెచ్‌ఒ జి.శిరీష, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, వెలుగు ఎపిడి ఎ.శ్రీనివాసరావు, పిహెచ్ఒ చిట్టిబాబు, డిఎల్‌పిఒ రాఘవన్, ఏడిఏ సిహెచ్‌కెవి చౌదరి, ఎస్ఒ టీ మార్తమ్మ, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఒ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, రవికుమార్, తహశీల్దారు ఎ.కృష్ణ జ్యోతి, పిఏఒ యల్.రాంబాబు, ఉపాధి హామీ ఎపిడి జి.శ్రీనివాసరావు, సిడిపిఒ సంధ్యారాణి, జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, సీనియర్ మేనేజర్ ముర్ల వెంకట రాజారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజేంద్ర బాబు, మల్లికార్జున రావు, సాయి సతీష్. డిప్యూటీ తహశీల్దార్లు స్వామి, రవీంద్రబాబు, సిడిపిఒ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి పెరిగిన తుమ్మ చెట్లను తొలగించాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల పరిధిలోని సంత సముదాయం దగ్గరలో చెరువు రోడ్డుపైకి ఏపుగా పెరిగిన తుమ్మ చెట్లును తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు. కొద్ది కాలంగా వర్షాలకు ఏపుగా పెరిగిన చెట్లు కొమ్మలు గాలి దుమారానికి రోడ్డుపైకి వాలిపోయి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందిగా మారాయి. సంత సమయంలో రోడ్డుపై వాహనాలు ఎక్కువగా వస్తున్న సమయంలో రోడ్లపైకి పెరిగిపోయిన తుమ్మచెట్లు వల్ల రోడ్డుపై వచ్చే వాహనాల కనబడపోవటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఆ దారిలో తుమ్మచెట్లు మధ్య నడవటం ఇబ్బందిగా ఉందని పాదచారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపైకి పెరిగిన చెట్లు కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.



రోడ్డుపైకి చొచ్చుకువచ్చిన తుమ్మచెట్టు